


**తల్లీ, శిశువు మృతికి కారకులైన డాక్టర్లపై చర్యలు**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 14 జూన్ , 2025 | పేజీలు : 06

# వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు

## నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి):** రైతులు వ్యవసాయం ద్వారా మంచి లాభాలు సంపాదించేందుకు ఎప్పుడూ పండించే సాధారణ పంటలు కాకుండా, ఉద్యాన, వాణిజ్య పంటలను సాగు చేయాలని ఈ పంటల వల్ల అధిక దిగుబడి, ఆదాయం వస్తుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో పలువురు రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తూ మంచి లాభాలను పొందుతున్నారని, జిల్లా లో విభిన్న పంటలను పండించి అధిక ఆదాయం ఆర్జిస్తున్న రైతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తిప్పర్తి మండలం,అంతాయ గూడెంలో రైతు కమలాకర్ రెడ్డి సాగు చేస్తున్న అంజీర తోటను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంజీర కు బ్రాండింగ్ చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని, అలాగే మార్కెటింగ్ లో సహాయం చేసే అంశం, స్థానిక స్వయం సహాయక మహిళా సంఘాల సహకారంతో వీలైతే ఒక రైతు ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించి దాని ద్వారా మార్కెటింగ్ కు చర్యలు తీసుకోవాలని,ప్యాకింగ్ హౌస్‌కు ఆర్థిక సహాయం అందించే విషయం పరిశీలించాలని ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతు కమలాకర్ రెడ్డి సుగుణమ్మ దంపతులను శాలువాతో సన్మానించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి అనంత రెడ్డి, తహసీల్దార్ పరశురాం ఉన్నారు.



**సాధారణ ప్రసవాలను పెంచాలి**

తిప్పర్తి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని,సాధారణ ప్రసవాలను పెంచాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అలాగే శిశుమరణాల సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని , ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. తిప్పర్తి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏఎన్ సి రిజిస్టర్, ఓ పి రిజిస్టర్, హై రిస్క్ రిజిస్టర్‌లను పరిశీలించారు. కాగా పి హెచ్‌సిలో శుక్రవారం వరకు 40 ఎఎన్‌సిలు అయినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి ఎం ప్రదీప్ బాబు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఆసుపత్రి సేవల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిప్పర్తికి నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాల నిర్మాణానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థలాన్ని పరిశీలించారు.

## స్థానిక సంస్థలకు సన్నద్ధం కావాలి

**ప్రజాపక్షం/డిండి;** రాబోయే స్థానిక సంస్థల్లో సిపిఐ తరుపున ప్రాతినిధ్యం ఉన్న గ్రామాల్లో పోటీకి శ్రేణులు సన్నద్ధం కావాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి జరిగిన సింగరాజుపల్లి శాఖ మహాసభ వడ్త్య కన్న అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు హాజరైన సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రేణులు కృషి చేయాలని, గ్రామ శాఖల్లో మహిళలు, విద్యార్థులు, యువజనులు పార్టీలో ఉండేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎలిమినేటి హుస్సేన్, గ్రామశాఖ కార్యదర్శి కదారి వెంకటయ్య, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** (నేడు) శనివారం జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా కోరారు. శుక్రవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్, కంపౌండబుల్ కేసులు, సివిల్ తగదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన కేసులు, డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసులు, మోటార్ ట్రాన్స్‌పోర్టు రోడ్డు నిబంధనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరి, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజమార్గమన్నారు. చిన్న, చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టు తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, పోలీస్ సిబ్బంది రాజీపడ్డదగిన కేసులను గుర్తించి ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీపడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది.

# భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం

## యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కరమవుతాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం లోని పెంచికల్ పహాడ్ గ్రామంలో భూ భారతి రెవిన్యూ సదస్సులో పాల్గొని భూభారతి రెవెన్యూ సదస్సు సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్య లు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ గ్రామసభల పై రైతులు ప్రత్యేకంగా అవగాహన పెంచుకొని వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులను పక్కాగా వినియోగించుకోవాలన్నారు. అధికారులు పహానీలతో రెవెన్యూ సదస్సులకు హాజరయ్యి సమస్యలు పరిష్కార దిశగా రైతులకు అవగాహన పరచడం జరుగుతుందన్నారు. అందుకనుగుణంగా దరఖాస్తులను పూర్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ ద్వారా సహకరిస్తున్నామని అనంతరం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని రైతులకు తెలియజేశారు. భూ భారతి చట్టంలో రైతుల భూముల సమస్యలు తప్పనిసరిగా పరిష్కారం అవుతాయని రైతులకు తెలియజేశారు. దరఖాస్తు చేయడం కోసం వచ్చే వారికి హెల్ప్ డెస్క్ లు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రైతులకు తెలియజేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మితం

## కుడకుడ ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** దేశ భవిష్యత్ తరగతి గదుల్లో నిర్మాతమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ అకస్మికంగా సందర్శించారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అడ్మిషన్ రిజిస్టర్‌లు, హాజర్ రిజిస్టర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మొత్తంలో నూతనంగా విద్యార్థులు చేరేలా చూడాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల నుండి ఐదో తరగతి అయిపోయిన విద్యార్థులను వెంటనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించే విధంగా చూడాలని అదేశించారు. ఇప్పటి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 మంది నూతనంగా అడ్మిషన్ పొందారని ఉపాధ్యాయులు వివరించారు. తదుపరి ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న షేక్ ఉమేజా, షేక్ హైరసభ లకు అక్షరభ్యాసం చేపించి ఆంగ్లంలో ఎబిసిడిలు రాపిచ్చారు. తదుపరి రెండో తరగతిలోని విద్యార్థులకు బుక్స్, యూనిఫాం అందజేశారు. ప్రాథమిక స్థాయి నుండే మంచిగా చదువుకోని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పి హెచ్ఎస్ ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ కవిత, ఉపాధ్యాయులు వెంకటనర్సమ్మ, ప్రతాప్‌కుమార్, రాజు, ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అనురాధ, సత్తయ్య, కోటయ్య, రవీందర్ పాల్గొన్నారు.





## విమాన ప్రమాద మృతులకు నివాళులు

**ప్రజాపక్షం/కోదాడ:** గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి కోదాడ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫి) ఎజెంట్ల సమైఖ్య అధ్యక్షులు కంజుల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ప్రమాదంలో ప్రయాణికులు, సామాన్యులు సహా ఎంతో భవిష్యత్ ఉన్న వైద్య విద్యార్థులు మరణించడం బాధకరమని, రెండు నిమిషాలు మౌనం పాటించి మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సోందిమియా, సంజీవయ్య, ఏబీఎం రాము, పోతుగంటి వెంకటాద్రి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, అహ్మద్‌అలీ, వీరారెడ్డి, రాజశేఖర్, అమర్‌సింగ్, విజయ్ శంకర్, కన్నయ్య పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం హనుమాపురం గ్రామానికి చెందిన ఒంగేటి సురేందర్ రెడ్డి ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు మృతుని కుటుంబ సభ్యులకు సాదినేని లక్ష్మీనారాయణ (పోలీస్ పటేల్) జ్ఞాపకార్థంగా సాధినేని ఉపేందర్ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు వారి కుటుంబానికి ఆర్థిక సహాయం రూ.5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు మణికంఠ గౌడ్ గ్రామ వార్డు మాజీ సభ్యులు తోటకూర వెంకటేష్ యాదవ్, మండల నాయకులు గజ్జి నరేష్ యాదవ్, ఎర్రబోయిన జ్ఞానేశ్వర్ యాదవ్, వంగేటి అంజిరెడ్డి గ్రామ శాఖ రంగా బాలకృష్ణ గౌడ్, గజ్జి నాగరాజు యాదవ్ కార్యకర్తలు శ్రీరామ్, రాజు, మహేష్, వెంకటేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాటికల్‌లో బాలసభ

**ప్రజాపక్షం/నల్లగొండ (నకిరేకల్ ):** బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాటికల్ ఉన్నత పాఠశాలలో బాలసభ నిర్వహించారు. మన ఊరు మనబడి మన బాధ్యత అనే అంశంపై నిర్వహించిన ఈ బాల సభలో సమన్వయకర్తగా చెనగాని నందిని, సభాధ్యక్షుడుగా పొల్లెగోని నాగసాయి వ్యవహరించగా వక్తలుగా ఆకిటి ఆశ్రిత, గాదగోని పూజిత, ఐశ్వర్య, మేడ హిమవర్షిని, మన్నెం భాను, షామిలి, పుట్టం నీల్ కుమార్, ఎబినైజర్, సరయు, మొగిలి భరత్ చంద్ర ఆజాద్, కారింగు సాయిరాం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, లొట్లపల్లి కోటయ్య, నూకల జానయ్య పాల్గొన్నారు.



## ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లను పెంచి వాటిని బతికించాలని సూర్యాపేట జిల్లా ప్రత్యేక అధికారి, ఇంటర్మీడియట్ డిప్యూటి సెక్రటరీ హేమచందర్ అన్నారు. శుక్రవారం నెమ్మికల్ ప్రభుత్వ కళాశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాళాలలో గత ఏడాది కన్న ఈ ఏడాది 30 శాతం అడ్మిషన్లు పెంచే బాధ్యత అధ్యాపకులు తీసుకోవాలని సూచించారు. కళాశాల పరిసర ప్రాంతాల్లోని పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను జూనియర్ కళాశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వ పాఠశాలకు అందిస్తుందని, కళాశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. సూర్యాపేట జిల్లాలో 8 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని, వాటిల్లో ప్రవేశాల శాతం పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 35 అడ్మిషన్లు జరిగాయని, ఇంకా పెంచాల్సిన బాధ్యత అధ్యాపకులు తీసుకోవాలని కోరారు. ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు వచ్చిన అడ్మిషన్లు చాల తక్కువ అని అధ్యాపకులు పదో తరగతి పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఒక్క పాఠశాలకు ఒక ఇన్‌ఛార్జి చొప్పున ఏర్పాటు చేసి ఒక్కక్కరు 20 అడ్మిషన్లు చేయాలని కోరారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి భానునాయక్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రతి కళాశాలను ఒకసారి సందర్శించి అధ్యాపకులకు సూచన చేశానన్నారు. జిల్లాలో గతంలో 2200 అడ్మిషన్లు ఉన్నాయని, ఈ ఏడాది 3500 కు పెంచే బాధ్యత తీసుకున్నామన్నారు. 15 రోజుల్లో పూర్తిస్థాయిలో అడ్మిషన్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గుణగంటి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** దోమలు వృద్ధి చెందకుండా ముందుగానే తగు ప్రణాళికలు తయారు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా 12వ రోజు పిల్లలమర్రిలో ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇండ్లలోని కూలర్లు, టైర్లు, చెట్ల తొట్టిలలో నీరు నిల్వ ఉండు ప్రాంతాలలో, మురుగునీరు నిల్వ లేకుండా, వాటిలో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రానున్న వర్షకాలం దృష్ట్యా శిధిలావస్థలో ఉండి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇండ్లలో ప్రజలు నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లి నివసించాలన్నారు. గృహ, వాణిజ్య, వ్యాపార సంస్థల వారు తమ ఇండ్లలోని చెత్తను తడి,పోడి చెత్తగా వేరుచేసి ఇంటిముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. వీధులలో సంచరించు కుక్కల పట్ల జాగ్రతలు పడాలని, పెంపుడు కుక్కలకు టీకాలు వేయించి, మెడలో బెల్టు పెట్టాలని అన్నారు. రానున్న వర్షకాలంను దృష్టిలో పెట్టుకుని శిథిలావస్థలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాలకు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ సత్యారావు, సానిటరి ఇన్స్‌పెక్టర్ సారుగండ్ల శ్రీనివాస్, టిఎంసి శ్వేత, వార్డు అధికారి నరేష్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డు అధికారి మచ్చ రాంబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ హామీలను అమలు చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** గత ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలని సూర్యాపేట జిల్లా నాటి తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వందమంది ఉద్యమకారులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకల జనుల నిస్వార్ధంగా, త్యాగ నిరతితో దశబ్దాల పాటు చేసిన పోరాటాల ఫలితంగా, బలిదానాల వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. దాదాపు ఆరు దశాబ్దాల పాట సాగిన తొలిదశ, మలిదశ ఉద్యమాలలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, దాదాపు 1300 బలిదానాలకు పాల్పడ్డారు. ఇంత ఘనమైన చరిత్రను గత పదేండ్ల కాలంలో అప్పటి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విస్మరించిందని. ఫలితంగా ఉద్యమకారులు ఆర్థికంగా గుర్తింపులేక మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కుంట్ల ధర్మార్జున్, మండాది డేవిడ్‌కుమార్, రాయపూడి వెంకటనారాయణ, తండు నాగరాజు, గట్ల రామశంకర్, సామ అంజిరెడ్డి, బొలి వెంకన్న, కిరణ్, కునుకుంట్ల సైదులు, బొజ్జ సైదులు, బాలెంల కిరణ్‌కుమార్, నవీన్, ఉపేందర్, బాలునాయక్ పాల్గొన్నారు.



## ఆయిల్‌పామ్ గెలల నాణ్యత యాజమాన్య పద్ధతులపై శిక్షణ

**ప్రజాపక్షం/తుంగతుర్తి:** ఆయిల్‌ఫామ్ తోటలను సాగు చేసే రైతులు ప్రాథమిక దశలోనే సరైన యాజమాన్యం పద్దతులు పాటించినట్లయితే మంచి దిగుబడి సాధించవచ్చని పతంజలి ఆయిల్ ఫామ్ కంపెనీ మేనేజర్ జె.హరిష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేశ్వాపురం గ్రామంలో సాగు చేస్తున్న తూము వెంకన్న, సత్యనారాయణ ల ఆయిల్‌ఫామ్ తోటలో గెలల కోత నాణ్యత ప్రమాణాలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే దీర్ఘకాలం పాటు మంచి దిగుబడి సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని అన్నారు. ఆయిల్‌ఫామ్ తోటలు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ శశికుమార్, పతంజలి ఆయిల్‌ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, యనగందుల రమేష్, నాగరాజు, రైతులు కేశవ్‌రెడ్డి, తూము నరేష్, సత్యనారాయణ, నర్సమ్మ పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న కాల్వలో పనులను పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/వలిగొండ :** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో అసంపూర్తి చేసిన భీమ లింగం కాల్వ వలిగొండ, సుంకిశాల గ్రామాల మధ్యన రోడ్డుకు అడ్డంగా తవ్వకాలు జరిపి రైతులు పంటలు వేసుకునే సమయం వచ్చిన ఇంతవరకు కల్వర్టు పనులు పూర్తి చేయక, మూసి నీటిని విడుదల చేయకుండా రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నందున తవ్వకాలు జరిపిన కల్వర్టు పనులు వెంటనే పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా, వ్యక్తిగతంగా పనులు జరిగే ప్రదేశానికి పిలిపించి, పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొప్పుల యాది రెడ్డి, రాచకొండ కృష్ణ, బందారపు రాములు, కందుల తానేష, మంద నరసింహ, బొడిగె ఆనంద్, పాక పుల్లయ్య, మైసొల్ల రామ నర్సు, వలిగొండ మాజీ ఉపసర్పంచ్ మచ్చగిరి ఎలిమినేటి వెంకటేశం, బిజెపి వలిగొండ మండల నాయకులు లింగస్వామి గౌడ్, గంగాధరీ దయాకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం మండల విద్యాధికారి రమావత్ నాగేశ్వర్‌రావు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్ఎం ఉదయ ఆద్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు, యూనిఫారంలు, మధ్యాహ్న భోజనంలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల చైర్మన్ మమత, భవిత సెంటర్ ఉపాధ్యాయులు త్రివేణి, ఏరుకొండ అంజయ్య, విద్యార్థులు తదితర పాల్గొన్నారు.





## వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కోదాడ:** వయోవృద్ధుల నిరాధరణకు గురి కాకుండా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలని, సీనియర్ సిటిజన్స్ సంఘం కోదాడ అధ్యక్షులు గడ్డం నర్సయ్య, జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు లు అన్నారు. శుక్రవారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం జూన్ 15 ఆదివారం కావడంతో ముందుగానే పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం వృద్ధులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో వయోవృద్ధులపై వేధింపులు, దాడులు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల, బంధువుల నిరాదరణకు గురై వయోవృద్ధులు రోడ్ల పాలవుతున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు వయోవృద్ధుల సమస్యలపై స్పందించి నిరాదరణకు గురి చేస్తున్న కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యాసాగర్‌రావు, పొట్ట జగన్‌మోహన్‌రావు, వేనేపల్లి శ్రీనివాసరావు, రఘువరప్రసాద్, కృష్ణమూర్తి, కోటయ్య, సాంబులు, బిక్షం, రం గారావు, బాలే మియా, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సమాచార హక్కు కమిషన్ సభ్యులుగా బిసిలకు అవకాశం కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇటీవల నియమించిన సమాచార కమిషనర్లలో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని బీసీలను నియమించి న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మంత్రిత్వశాఖల్లో బీసీలకు ప్రాధాన్యత గల శాఖలు కేటాయించాలని కోరారు. బడ్జెట్ ఎక్కువ ఉన్న, పరిపాలన విధమైన శాఖలు ఇవ్వాలని కోరగా మహేష్‌కుమార్‌గౌడ్ సానుకూలంగా స్పందించారని అన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల జోరు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పనులుజోరుగా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షలు అందిస్తుంది. నిరుపేదలకు వరంగా మారింది అందుకు ఇందిరమ్మ ఇండ్లజోరు గ్రామాల్లో సంతరించుకుంది.



## ఇల్లును అక్రమంగా ఆన్‌లైన్ చేసిన వారిపై చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తమ ఇల్లు ను అక్రమంగా గ్రామ పంచాయతీ పరిధిలో ఆన్‌లైన్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు వెల్లంపల్లి ప్రవీణ్ అధికారులను కోరారు. శుక్రవారం నల్లగొం డ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మర్రిగూడ మండలం శివన్న గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోగల ఎస్‌సి కాలనీలో ఉన్న రెండు గుంటల ఇందిరమ్మ ఇల్లును 1994లో బట్టపోతు బిక్షమయ్య దగ్గర కొనుగోలు చేసి గత 30 సంవత్సరాలుగా నివాసం ఉండడం జరిగిందని తెలిపారు. 2013లో మా నాన్న ఉద్యోగ రీత్యా నల్లగొండలో స్థిరపడ్డామని అప్పటినుండి ఆ ఇల్లు మా పరిధిలోనే ఖాళీగా ఉండడంతో 2015 సంవత్సరంలో గ్రామ సెక్రెటరీ తమ ఇంటిని బేరే రాములకు తమ అమ్మినట్టు ఎటువంటి ఆధారాలు గాని, రిజిస్ట్రేషన్ కానీ, బాండ్ పేపర్ గాని లేకున్నా గ్రామపంచాయతీ సెక్రటరీ మా ఇంటిని బేరే రాములు పేరుమీద ఆన్‌లైన్ చేశాడని ఆరోపించారు.ఈ విషయం ఇటీవల జరిగిన సర్వేలో తెలిసిందనీ ఇప్పుడున్న సెక్రటరీని సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పకపోగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనీ ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు సమగ్ర విచారణ చేసి మా ఇంటిని అక్రమంగా ఆన్‌లైన్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని గ్రామపంచాయతీ రికార్డులలో సైతం వారి పేరును తొలగించి మాకు న్యాయం చేయాలని కోరారు.

## విద్యా వ్యాపారాన్ని అరికట్టండి :అశోక్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శుక్రవారం పట్టణం లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో పుట్ట గొడుగులా పుట్టుకొచ్చిన ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు తొత్తుగా మారి విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక శోభకు గురి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని లేనట్లయితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దాసరాజు జయరాజు, సిద్ధం రాజు, నాయిని భాస్కర్, అంజిగౌడ్, గంగాధర్, ఉపేందర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు భాష్యానాయక్ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్పీ క్యాంప్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్యానాయక్, ఉపాధ్యాయులతో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ నిరుపేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ప్రైవేట్ పాఠశాలల్లో తాము కష్టపడి సంపాదించిన సొమ్మును తమ పిల్లల చదువుల పేరుతో నాశనం చేసుకోకుండా నాణ్యమైన ఆహ్లాదకరమైన స్నేహపూర్వక వాతావరణంలో బోధించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించి తమ డబ్బులను ఆదా చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షుతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, కంప్యూటర్ విద్య అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, వడ్డెగాని జానయ్య, ఇందిరా, ఆదిలక్ష్మి, ఉషారాణి, యుగంధర్, ఉమా మహేశ్వరి, సబార్డినేట్ భూలక్ష్మి, వాసు, మదారమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శివన్నగూడలో 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట'



**ప్రజాపక్షం/మర్రిగూడ:** శివన్నగూడ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరములు నిండిన చిన్నారుల ఇండ్లకు ర్యాలీగా వెళ్లి మూడు సంవత్సరములు నిండిన పిల్లలను అంగన్వాడి సెంటర్ కు పంపివ్వాలని పూల బొకేతో ఆహ్వానిస్తూ తల్లిదండ్రులను కోరడం జరిగింది. .అలాగే అంగన్వాడి సెంటర్ లోని పిల్లలను పూల బొకేతో సెంటరుకు ఆహ్వానిస్తూ చిన్నారులకు తల్లులకు ఎగ్ బిర్యానీ వడ్డించారు.ఈ కార్యక్రమానికి సూపర్వైజర్స్ ఎం. శ్రీలత,ఎస్. యశోద,గ్రామ కార్యదర్శి లక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ అమృత, ఆశ, అంగన్వాడీ టీచర్స్,హెల్పర్స్, తల్లులు,పిల్లలు పాల్గొన్నారు.



## రెడ్డీస్ ల్యాబ్ కార్మికులకు రూ.1303 వేతన పెంపు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ రాజీలేని పోరాటాల నిర్వహిస్తుందని దానిలో భాగంగా డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ యూనిట్ 5 పెద్దదేవులపల్లిలో పర్మినెంట్ కార్మికులకు ఉన్నత వేతనం పైన రూ.1303 రూపాయలు పెంచుతూ అగ్రిమెంట్ చేయడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. హైద్రాబాద్‌లో జేసీఎల్ సమక్షంలో అగ్రిమెంట్ జరిపి పరస్పర ఒప్పంద పత్రాలు తీసుకోవడం జరిగిందన్నారు. యూనిట్5 యాజమాన్యం కృష్ణారావు, వంశీకృష్ణ, అంజయ్య చర్చల్లో పాల్గొన్నారని, చర్చలు విజయవంతమైనాయని తెలిపారు. యాజమాన్యాలు కార్మికుల హక్కులను, విధులను గుర్తిస్తే ఎంతటి విజయాలైనా సాధించవచ్చన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్య క్షుడు అవుతా సైదులు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.శ్రీ ను, ఎస్.వేణుగోపాల్, సత్యనారాయణ, ప్రసాద్, సింగం సైదులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** గవర్నమెంట్ పాఠశాల అయినప్పటికీ ప్రవేట్ పాఠశాలకు దీటుగా స్మార్ట్ టీవీలతో డిజిటల్ క్లాస్ రూమ్ ప్రారంభించడం సంతోషంగా ఉందని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్ఎస్‌కె ఫౌండేషన్ అధినేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ వారి సొంత నిధులతో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్స్‌కి సంబంధించిన స్మార్ట్ టీవీలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీసీఈఓ ఎన్.శోభారాణి, ఆర్ఎస్‌కె ఫౌండేషన్ అధినేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ చేతుల మీదుగా పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీసీ ఈఓ ఎన్.శోభారాణి. డిఈఓ కె.సత్యనారాయణ, ఎంపీడీఓ సిహెచ్.శ్రీనివాస్, భువనగిరి మండల ఎంఈఓ పి.నాగవర్ధన్, ఎంపీఓ ఎం.దినకర్, పంచాయతీ సెక్రెటరి వై.వెంకటేష్, ఏపిపిసి చైర్మన్ ఒరుగంటి రమ్య, తాజ్ పూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇటుక బట్టీ తరలింపునకు చర్యలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజలను వివిధ వ్యాదులకు గురి చేస్తున్న ఇటుకబట్టీని తరలించేందుకు అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని మండలంలోని గూడూరు గ్రామ ప్రజలు శుక్రవారం గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు గ్రామ పరిధిలోని శ్రీవీరభద్రస్వామి దేవాలయం వెనుకగల ఇటుకబట్టీల నుంచి విపరీతంగా బూడిద గ్రామంలోని ఇండ్లలో పడుతుందని, దీంతో తాము అనారోగ్యాలపాలవుతున్నామని అన్నారు. అట్టి ఇటుకబట్టీ నుంచి పన్ను వసూలు చేయకుండా యజమానికి నోటీసులు అందించి బట్టీని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు

# బస్‌పాస్ ధరలు పెంచే ఆలోచన సరికాదు

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుండి లక్షలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించటానికి బస్‌పాసుల మీద ఆధారపడి పట్టణాలకు, నగరాలకు వస్తున్నారని, ఇందులో అత్యధికంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులే ఉన్నారని, గ్రామాల్లో అందుబాటులో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలను, విద్యార్థులు లేరని కారణం చూపుతూ మూసివేస్తున్నారని, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల బస్‌పాస్ ధరలు పెంచే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని పిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగారాజు అన్నారు. శుక్రవారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికి మండల కేంద్రాలలో ప్రభుత్వ, డిగ్రీ కళాశాలలు లేనందున జిల్లా కేంద్రం దాకా రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు అదనంగా 20శాతం చార్జీలు పెంచడంతో 400 ఉన్న పాస్ ధర ఛార్జీని 600 కు పెంచడం, మూడు నెలలకు 1200 నుండి 1800కు పెంచడంతో విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని, విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జి.శ్యామ్, సల్మాన్, నితిన్, రణదీర్, మధు పాల్గొన్నారు.



## పల్లెర్ల సిపిఐ కార్యదర్శి దుర్గపతి నరసింహ

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** మండలంలోని పల్లెర్ల సిపిఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా దుర్గపతి నరసింహ, సహాయ కార్యదర్శిగా కంబాలపల్లి కిష్టయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల సిపిఐ కార్యదర్శి మారుపాక వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.



## 16న సిపిఐ 9వ మండల మహాసభ



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బొమ్మలరామారం మండల తొమ్మిదవ మండల మహాసభ మర్యాల గ్రామ కమిటీ హాల్ విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బోలాగని సత్యనారాయణ అన్నారు. 16న జరిగే సిపిఐ పార్టీ మండల మహాసభ ప్రతి కార్యకర్తలు హాజరై మహాసభని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి అన్నేమైన వెంకటేశం, జిల్లా సమితి సభ్యులు వడ్లకొండ బారతమ్మ, మండల కమిటీ సభ్యులు విట్టల్ నాయక్, ఎనగల రాజప్ప, పల్లపు మల్లేష్ పాల్గొన్నారు.

## మద్దెల ప్రసాద్ జీవితం ఆదర్శం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ మామ అయినటువంటి మద్దెల ప్రసాద్ జీవితం నేటి తరానికి ఆదర్శం అని కొండమల్లేపల్లి మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం దేవరకొండ లోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన స్వర్గీయ మద్దెల ప్రసాద్ సంస్మరణ సభకు వారు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, విప్పలపల్లి జితేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ బహుకరణ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న వాసాలమర్రి గ్రామానికి చెందిన పేద విద్యార్థి పోగుల మైథిలికి బాలాజీ బ్లూ అగ్రి గ్రేడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోలా ఆంజనేయులు 65 వేల రూపాయల విలువగల ల్యాప్ టాప్ ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద నిరుపేద విద్యార్థికి లాప్టాప్ ను అందజేసినట్లు తెలిపారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు మైథిలిని ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలని ,పేద విద్యార్థులకు అందుబాటులో ఉండి సహకరిస్తానని అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు, ఏడు తరగతి గదులు లేక విద్యార్థులు



ఇబ్బంది పడుతున్నారని తాత్కాలికంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా గదులను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలమని, ఉపాధ్యాయులు సౌమ్య, శ్రీనివాస్ రెడ్డి, ఎండి.హసీనా నహీం, వేణుగోపాల్, వీర జంగారెడ్డి, విజయ, పోరెడ్డి కవిత, హమీర్, సి ఆర్ పి శారద, గ్రామస్తులు పోగుల నర్సింలు, మెరుగు సతీష్, పలుగుల శ్రీనివాస్, సింగం వెంకటేశం, శివరాత్రి జహంగీర్, దుడుక శ్రీశైలం ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ప్రీస్కూల్ విద్య






**ప్రజాపక్షం/నందికొండ:**నాగార్జునసాగర్ హిల్ కాలనిలోని ఐసిడిఎస్ అనుముల ప్రాజెక్టు,చలకుర్తి సెక్టార్ పరిధిలోని నాలుగవ అంగన్వాడి సెంటర్లో సూపర్వైజర్ గౌసియా బేగం ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్వాడీ సెంటర్ల పరిధిలో అంగన్వాడి బడిబాట కార్యక్రమంతో పాటు విద్యార్థులు టీచర్లతో కలసి ర్యాలీని నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరముల నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. ప్రీ స్కూల్ విద్యకై ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం భరించుట కంటే అంగన్వాడి కేంద్రాలలో తమ పిల్లలను చేర్పించడం వలన పౌష్టికాహారం తో పాటు పరిశుభ్రత పై అవగాహన కల్పించి, ఆటపాటలతో ప్రీ స్కూల్ విద్యను నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శారదా దేవి, రాజేశ్వరి, అంగన్వాడి ఆయా సుజాత, గర్భిణీ స్త్రీలు,బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని సల్కనూరు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు, ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలోని విద్యార్థిని విద్యార్థులకు ఆటపాటలతో విధ్యాభ్యాసాలు నేర్పించడం జరుగుతుందని అన్నారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి కొండయ్య, ఉపాధ్యాయులు నగేష్ నాయక్, సైదిరెడ్డి అంగన్వాడీ టీచర్ జ్యోతి, ఆయా లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని మాదాపూర్ సెక్టార్ ములకలపల్లి గ్రామంలో శుక్రవారం అమ్మ మాట, అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ నజీమోనిస ఆధ్వర్యంలో ప్రీస్కూల్ తల్లులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి స్కూళ్లకు వచ్చే పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య, వర్క్, బుక్స్ రాయించడం జరుగుతుందని, ప్రతి బుధవారం పిల్లలకు ఎగ్ బిర్యానీ పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వి.సులోచన, ఏఎన్ఎం సంధ్యారాణి, ఆయా కె.మాధవి, గర్భిణీలు, బలంతలు, తల్లులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాల కోసం మండల స్థాయిలో క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** నాలుగవ తరగతిలో స్పోరట్స్ స్కూల్ లో ప్రవేశాల కొరకు మండల స్థాయిలో జూన్ 16 నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించబడుతాయని ఈ పరీక్షలో పాల్గొన డానికి గల అర్హతలు 01.09.2016 నుండి 31.08.2017 తేదీ లోపల జన్మించి ఉండాలని, క్రింద తెలిపిన పోటీలు నిర్వహించ బడతాయని మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురామ్ రెడ్డి తెలిపారు. 30 మీటర్స్ ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్స్ రన్నింగ్, 6స10 మీటర్స్ షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్, వర్టికల్ జంప్,ఫ్లెక్సీబులిటీ అండ్ మెడికల్ టెస్ట్ లు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 9:30 గంటలకు మోట కొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు పై పోటీలను నిర్వహించబడుతాయని,ఆసక్తి ఉన్న విద్యార్థులు నాతి మల్లేశం వ్యాయామ ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల మోటకొండూరుని సంప్రదించాలని రఘురామ్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని సాధించేలా కష్టపడాలని వాసవిక్లబ్ అధ్యక్షులు మంచాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల హైస్కూల్‌లో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేలా దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ కష్టపడి చదివారని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. గత మూడు సంవత్సరాలుగా ఈ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరి బిక్కుమళ్ల కృష్ణ, ఆర్‌సి మిరియాల సుధాకర్, జెర్సీ, చల్లా లక్ష్మ య్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/మునగాల:** ఈనెల 14న శనివారం జరిగే జాతీయ మెగాలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నేడు జరగనున్న జాతీయ మెగా లోక్ ఆదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్, కంపౌండబుల్‌కేసులు, సివిల్, భూ తగదా కేసులు, ఆస్తి కేసులు, కుటుంబ పరమైన కేసులు ఉన్న వారు రోడ్డు నిబంధనల ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరి కేసులలో కక్షిదారులు రాజీపడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీమార్గమే రాజమార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టు తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోవద్దన్నారు. లోక్ ఆదాలత్ ద్వారా సత్వరమే న్యాయం జరుగుతుందన్నారు.

## ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటుట కోసం ఉపాధి హామీ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాములు నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మొక్కలు నాటుటకు స్థలాలను గుర్తించి పిట్టింగ్ వర్క్ స్టార్ట్ చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రమేష్, ఈసీ, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు పింఛన్, ఇంటి స్థలం మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులకు పెన్షన్ తో పాటు ఇంటి స్థలము మంజూరు చేయాలని తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పెన్షన్‌తో పాటు ఇంటి స్థలము వెంటనే మంజూరు చేయాలని ప్రధాన డిమాండ్ చేస్తు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కి తెలంగాణ ఉద్యమకారులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి,టీజేఏసీ జిల్లా నాయకులు డాక్టర్ తోట నరసింహాచారి మాట్లాడుతూ వేలాది మంది అమరత్వం, లక్షలాదిమంది పోరాట ఫలితంగా తెలంగాణ స్వరాష్ట్రం ఏర్పడింది గత ప్రభుత్వ 10 సంవత్సరముల పాలనలో ఉద్యమకారులను ఉద్దేశ పూర్వకంగా విస్మరించింది ఫలితంగా ఉద్యమకారులు ఆర్థికంగా గుర్తింపు లేక మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు వారంతా తీవ్ర మనోవేదనకు లోనయ్యారు ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల లో ఉద్యమకారుల గౌరవాన్ని కాపాడుతామని స్పష్టమైన హామీ ఇచ్చింది .కానీ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అవుతున్నప్పటికీ ఉద్యమకారుల హామీలను పట్టించుకోవడం లేదు ప్రభుత్వం వెంటనే స్పందించి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారులకు



గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రతి ఉద్యమ కారునికి 250 గజాల ఇంటి స్థలము, హెల్త్ కార్డు, కనీస గౌరవ వేతనం, బస్సు పాసులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఇందూరు సాగర్, గుండెబోయిన నాగేశ్వరరావు, వంటిపాక యాదగిరి ,ఈ వెంకటేశం ,జి యాదగిరి, ఎల్ క్రాంతి కుమార్, ధీరావత్ వీర నాయక్, బి నర్సింలు, రాపోలు శ్రీనివాసులు, కల్లూరి అయోధ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక బడుల్లో సామూహిక అక్షరాభ్యాసం



ప్రజాపక్షం/తుర్కపల్లి : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా తుర్కపల్లి మండలంలోని ప్రభుత్వ బడుల్లో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అందులో భాగంగా తుర్కపల్లి మండలంలోని దత్తాయిపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల దత్తాయపల్లి, ప్రాథమిక పాఠశాల వేలుపుపల్లి, వెంకటాపురం, గుజ్జవానికుంట తండా, ప్రాథమిక పాఠశాలజంగారెడ్డి గుంట తండా, ప్రాథమికోన్నత పాఠశాల ఇబ్రహీంపూర్, ప్రాథమిక పాఠశాల దయ్యం బండ తండా, ఇలా ఆయా గ్రామాల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బి.అనురాధ, వి.లక్ష్మయ్య, సౌజన్య సుజీవన్ రావు, అనిత, నాగార్జున రమేష్, ఉపాధ్యాయులు డి.ప్రవీణ్ తిరుపతిరెడ్డి, శ్రీవిద్య, రజిత, శ్రీధర్,లక్ష్మణ్, హాజీమ, పుష్ప కుమారి సిఆర్‌పి వీరస్వామి పాల్గొన్నారు.



కాటేపల్లి ఎంపిపిఎస్‌లో సమూహిక అక్షరాభ్యాసం

ప్రజాపక్షం/మోటకొండూర్ : మోటకొండూరులో 2025/26 విద్యా సంవత్సరం బడిబాటలో భాగంగా కాటేపల్లి ఎంపిపిఎస్‌లో డిఈఓ కే.సత్యనారాయణ, ఎంఈఓ రఘురామ్ రెడ్డిల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో నూతనంగా జాయిన్ అయిన 12 మందీ 1వ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కే.రఘురామ్ రెడ్డీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదర్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎం.బాల గంగాధర్ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం పి.మంజుల, ఉపాధ్యాయులు శంకర్, శాంతకుమారి, సిఆర్‌పి నరేందర్, గ్రామ మాజీ సర్పంచ్ మంత్రి రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/చండూరుః** రైతు భరోసాకు దరఖాస్తులను సోమవారం నుంచి స్వీకరించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి చంద్రిక తెలిపారు. చండూరు మండలంలో వానాకాలం 2025లో కొత్తగా రైతు పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు సోమవారం నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దీనికి కావలసిన పత్రులు రైతు భరోసా దరఖాస్తు ఫారం , పట్టాదారు పాస్ బుక్ జీరాక్స్ , ఆధార్ కార్డు జీరాక్స్ , బ్యాంక్ ఎకౌంటు జీరాక్స్ కాఫీలను జతరచ్చి సంబంధిత ఏఈఓలకు అందజేయాలని తెలిపారు . గతంలో రైతు భరోసా డబ్బులు వచ్చిన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలసిన అవసరం లేదని తెలిపారు.

## నేడు బిసిల సదస్సు

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్** : పట్టణంలోని టిఎన్‌జీఓ భవనంల్లో బిసి ఇంటెలెక్చ్యువల్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు ముఖ్యఅతిథిగా బీసీ ఇంటెలెక్చ్యువల్ ఫోరమ్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ టీ చిరంజీవులు హాజరు కానున్నారని బిసి నాయకులు చెన్న శ్రీకాంత్ తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలోని బిసిలు, మహిళలు,యువకులు,విద్యార్థులు,ఉద్యోగులు తదితరులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఒక మార్పు - అభివృద్ధికి మలుపు

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణంలో 100 రోజుల ప్రణాళిక కార్యచరణలో భాగంగా శుక్రవారం పురపాలక సంఘం కమిషనర్ వై. సుదర్శన్ ఆధ్వర్యంలో 17వ వార్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నీరు నిల్వ ఉన్న చోట దోమ లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్, స్ప్రే చేయించి, బ్లీచింగ్ చల్లించి, డ్రైనేజిలను శుభ్రపరచడం లాంటి కార్యక్రమాలు చేయడం జరిగింది. చెత్త విభజన పై సంతోష్‌మాత కాలనీ , సంజయ్‌కాలనీ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. సానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సక్రునాయక్‌లు మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ స్వచ్ఛతకు సహకరించాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వల్ల డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే నిల్వ ఉన్న నీరును తొలగించుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పురపాలక సంఘం స్వచ్ఛ ఆటోకు అందించాలని సూచించారు. పారిశుద్ధ్య, వాటర్ సప్లై సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని, షాప్‌ల యాజమానులు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





## మద్దెల ప్రసాద్ సంస్మరణ సభ

**ప్రజాపక్షం/దేవరకొండ:** నిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించిన ప్రజా హృదయుడు ఆదర్శవ్యక్తిత్వం, నిబద్ధతగా జీవించిన ఆదర్శప్రాయులు దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ మామ మద్దెల ప్రసాద్ సంస్మరణ సభ శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ చిత్రపటానికి ఎంఎల్‌ఏ బాలునాయక్ కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రసాద్ చిత్రపటానికి కాంగ్రెస్, సిపిఐ, వివిధ పార్టీల నాయకులు, విలేకరులు, అధికారులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు మండల స్థాయిలో క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/గుండాల;** హకీంపేటలోని తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో నాలుగవ తరగతిలో స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కొరకు మండల స్థాయిలో జూన్ 16 నుండి 19 వరకు పరీక్షలు నిర్వహించబడుతాయని, 01092016 నుండి 31082017 లోపు జన్మించి ఉండాలని, ఈనెల 7 నుండి ఆన్‌లైన్‌లో విద్యార్థులు తమ పేర్లను tqss.telangana.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న విద్యార్థులకు మాత్రమే పోటీలు నిర్వహించబడతాని మండల విద్యాధికారి మన్నె అగ్గిరాములు తెలిపారు. ఈనెల 17వ తేదిన ఉదయం 9.30 కు గుండాల జిల్లా పరిషత్ హైస్కూల్ నందు పోటీలు నిర్వహించబడతాయని ఆయన తెలిపారు.

## సీజనల్ వ్యాధులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలి



**ప్రజాపక్షం/వేములపల్లి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ పి శ్రీనివాస్ అకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సమర్ధవంతంగా వాటిని ఎదుర్కోవాలని అన్నారు, టిబి ముక్త అభియాన్ ను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు, ప్రభుత్వ వైద్యశాలల్లో నార్మల్ డెలివరీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ అరుంధతీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని వాసాలమర్రి గ్రామానికి చెందిన చెన్నూరి మైసమ్మ మరణించడంతో ఆమె కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆయన ఎక్కడ పనిచేసినా అంతే..!

**-పాఠశాల పురోభివృద్ధి, విద్యార్థుల ఉన్నతే లక్ష్యం**







**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆయన ఎక్కడ పనిచేసినా ఆయనది ఒక్కటే లక్ష్యం. పాఠశాలను, పరిశుభ్రతలోనూ, విద్యాభివృద్ధిలోనూ, మౌలిక వసతుల కల్పన లోనూ అగ్రభాగాన నిలపడం. ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను విద్య సహా క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ముందు వరుసలో నిలపడం. ఇప్పటి వరకు ఐదు పాఠశాలల్లో పని చేసిన ఆయన ఆ పాఠశాలలపై తనదైన ముద్ర వేయడమే కాకుండా ఆయా గ్రామాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఏళ్ల గడిచినా ఇప్పటికీ ఆ గ్రామాల ప్రజలు రాంమోహన్ గారు అని గుర్తు తెచ్చుకునే కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నతనం నుంచి అభ్యుదయ భావాలతో పెరిగిన ఆయన ఉద్యోగ ధర్మంలోనూ అదే పాటిస్తూ ఉత్తమ ఉపాధ్యాయునిగా వినతికెక్కారు. తనికెళ్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వాసిరెడ్డి రాంమోహన్ తాను పనిచేస్తున్న పాఠశాలకు విద్యార్థులు వచ్చేలా చర్యలు తీసుకోవడం వచ్చిన వారిని క్రమశిక్షణతో ఎదిగేలా చేయడం పైనే ఆయన దృష్టిసారించే వారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడా, సాంస్కృతిక రంగాల వైపు విద్యార్థులకు ప్రవేశం



కల్పించే వారు. తాను క్రీడాకారుడు కావడం కూడా ఆయనకు సానుకూల అంశంగా మారింది. ఇక పాఠశాలలో వసతులు కల్పించడానికి తన సొంత ధనాన్ని వెచ్చించిన సందర్భం కూడా లేకపోలేదు. మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా అన్ని జాగ్రత్తలు తీసుకునే వారు. ఆయన ఎక్కడ పనిచేసినా విద్యార్థులు వారి తల్లిదండ్రులు బరువెక్కిన హృదయాలతో వీడ్కోలు చెప్పారంటే అతిశయోక్తి కాదు. పాఠశాల నుంచి బదిలీ అయి వెళ్లేటప్పుడు మా సారును బదిలీ చేయవద్దంటూ అడ్డు తిరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు తనికెళ్ల పాఠశాలలో పనిచేస్తున్న ఆయన గ్రామంలో బడిఈడు ఉన్న ప్రతి ఇంటికి తిరుగుతూ పిల్లలు బడికి వచ్చేలా చైతన్యపరుస్తున్నారు. ఒకరిద్దరు పిల్లలు లేక మూతపడుతున్న ప్రాథమిక పాఠశాలలో 35 మంది పిల్లలతో ప్రాథమిక పాఠశాల కళకళలాడుతుంది. మోటార్ సైకిల్ సౌండ్ సిస్టంను అమర్చుకుని గ్రామంలో తిరుగుతూ పిల్లలను బడిలో చేర్చడానికి ఆయన చేస్తున్న ప్రయత్నం సర్వత్రా అభినందనలు అందుకుంటుంది. ఈ దిశగా మరి కొంత మంది ఉపాధ్యాయులు ప్రయత్నిస్తే ప్రభుత్వ విద్య పదిలమవుతుంది.

# ప్రమాదకరంగా వైరా రింగు రోడ్డు గుంతలు..!

**-ఇలా ఉంటే ప్రయాణం ఎలా..?**
**-అధికారులకు గుంతలు కనిపించడం లేదా..?**
**-ప్రమాదాలకు నిలయంగా మారిన గుంతలు**





**ప్రజాపక్షం/వైరా:** వైరా రింగు రోడ్డు వద్ద గత కొంతకాలంగా విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కొనసాగుతుంది. ఇలాంటి సమయంలో రింగు రోడ్డు వద్ద పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. అసలే విపరీతమైన ట్రాఫిక్ ఆపై గుంటలు ఆ గుంటలతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరిగిద్దో అని ఆందోళన చెందుతున్న ప్రజలు, నిత్యం రింగు రోడ్డు కూడలి వద్ద పెద్ద ఎత్తున వాహనాలు వస్తూపోతూ ఉంటాయి. ఈ ప్రాంతంలో ఏర్పడిన గుంటలు అతి ప్రమాదకరంగా మారాయి. ఆ గుంటలను తప్పించడానికి వాహనదారులు పడరాని ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క గుంట మధ్య అడుగు దూరం లేకుండా గుంటలు ఏర్పడ్డాయి. ఆ గుంటలను వాహనాలు తప్పించబోయిన ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. గత రరెండు రోజుల క్రితం రింగు రోడ్డు వద్ద ఏ్పడిన గుంటలో లారీ రాత్రిపూట దిగుబడి ఆగిపోయింది. దీంతో ఆ డ్రైవర్ క్లీనర్ పడ్డ ఇబ్బందులు చెప్పలేనివి. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయిన క్రిందపడ్డారు. ప్రమాదవశాత్తు వారికి ఎలాంటి ప్రమాదం జరగలదు. పెద్ద ఎత్తున గుంటలు రింగు రోఉడ్డ వద్ద కనిపిస్తూ ఉంటే సంబంధిత అధికారులు ఎక్కడున్నారు. అసలు కార్యాలయాలకు వస్తున్నారా విధి నిర్వహణలోనే ఉంటున్నారా అనేది కూడా ఇప్పుడు నోట చర్చగా మారింది. ఎందుకంటే నిత్యం కొన్నివేల మంది ప్రజలు ఈ రోడ్లపై తిరుగుతూ ఉన్నారు. అధికార యంత్రంగా రోడ్లపై తిరిగితే ఈ గుంటలు వాళ్లకి కనిపించే ఉంటాయి. వెంటనే గుంటలకు మరమ్మత్తు పనులు పూర్తిస్థాయిలో చేపట్టి ఉండేవారు. ఇటీవల కాలంలో ఈ రింగు రోడ్డు వద్ద ఏర్పడిన గుంటల వలన ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ప్రమాదాలకు నిలయంగా మారిన వైరా రింగు రోడ్డు వద్ద గుంటలను మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుకుంటున్నారు.

# వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో గత కొంతకాలంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి పోయి నీరు వృధాగా పోతుంది. ఈ విషయం అధికారులు తెలిపిన్పటికీ ఈ మాత్రం పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ పనులు జరుగుతున్నా ఇంకా పైప్‌లైన్ బాగు చేయకపోవడం వలన తమ పొలాలకు శుభ్రం చేసుకుని పంట వేసుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లే దారిలో నెలరోజుల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు వృధాగా పోతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.


# లక్ష్మీపురం పాఠశాలలో అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు.ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ కరామత్ ఆలీ మాట్లాడుతు ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించిందని పాఠశాలలు అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు విద్యను బోధిస్తారని విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సహోధ్యాపాయుడు దూరి జయరాజు, అంగన్‌వాడీ టీచర్ చింతపల్లి సువార్త, ఆయా బాణోత్ సుశీల, గ్రామ దీపికి గుగులోత్ లక్ష్మి , నరేష్, నరసింహారావు, అనూష, కాంతమ్మ, హుస్సేన్, మౌనిక, నీలమ్మ, చిలకమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి దందా..!

**-ప్రభుత్వాదాయానికి భారీగా గండి**
**-లక్షలు పోగేసుకుంటున్న మాఫియా**
**-అరికట్టాల్సిన అధికారులు ఆ వైపు చూడరు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అక్రమ మట్టి దందా చట్టవిరుద్ధంగా జరుగుతూ పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నా, భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీస్, రవాణా శాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు పర్యావరణవేత్తలు. అక్రమంగా మట్టిని తవ్వి, తరలిస్తూ, ప్రభుత్వానికి నష్టం కలుగిస్తున్న మట్టి మాఫియాకు రాజకీయ నాయకుల అండ పుష్కలంగా ఉండటంతో మాఫియా ఆడిందే ఆట, పాడిందే పాటగా మరిందని ప్రతి పక్ష పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. మట్టిని తవ్వడానికి అనుమతి లేకపోయినా, కొందరు మట్టిని తవ్వి, దానిని చట్టవిరుద్ధంగా ,టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోవటమే కాకుండా,పర్యావరణానికి హాని కలిగి,భూగర్భ జలాలు పడిపోయి, మూగ జీవాలు మాయమైపోతున్నాయి. మట్టి అక్రమ తోలకాలతో పచ్చని బీళ్ళు లోతట్టు ప్రాంతాలుగా మారుతున్నాయి. అనుభవం లేని డ్రైవర్లతో రోడ్లు నాశనమవుతున్నా యి. నిన్నటి వరకు చెరువు మట్టిని రైతుల పేరుతో వెంచర్లకు తరలించింది మాఫియా. బారీ వాహనాలు ప్రదాన సెంటర్లలో వాయు వేగంతో దూసుకుపోతుండటంతో వాహనదారులు,పాదాచారులకి తీవ్ర ఇబ్బందులు కలగటమే కాకుండా ,ట్రాఫిక్ కు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. సుమారు 10 నుండి 15 టిప్పర్లు ఆంధ్రా నుండి సత్తుపల్లి పట్టణంలో తిరుగుతున్నాయి.వాటికి అనుమతులు ఉన్నయా లేవా, వాటి కెపాసిటి ఎంత, మాఫియా తరలిస్తున్న మట్టి కెపాసిటి ఎంత అనేది రవాణా శాఖ చూడాల్సి ఉంటుంది కాని గత నెల రోజులుగా సామర్థ్యానికి మించి లోడింగ్ తో వాహనాలు తిరుగుతున్న రవాణా శాఖాధికారులు ఒక్క కేసు నమోదు చేయకపోవటం ఏమిటన్నది అం తు చిక్కని ప్రశ్నగా మారింది. రైతుల పేరుతో చెరువులలో మట్టిని భారీగా తరలించి వెంచర్లకు అమ్ముకుంటుంటే నీటిపారుదల శాఖాధికారులు కార్యాలయాలకే పరిమితమవ్వటం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. టిప్పర్ల వల్లన పట్టణంలోని ప్రధాన సెంటర్లైన కాకర్లపల్లి ,సిద్దారం రోడ్డు, రింగ్ సెంటర్, కల్లూతరు రోడ్డు తదితర కూడళ్ళ వద్ద ఈ వాహనాల వల్లన ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతున్నా పోలీస్ శాఖ వాటి వైపు కన్నెత్తి చూడకపోవటం విస్మయాన్ని కలిగిస్తుంది.అదే విధంగా రెవిన్యూ భూములలో సైతం అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నా రెవిన్యూ శాఖ అధికారులు చోద్యం చూస్తుండటం గమనార్హం. పట్టణం, మండలంలోని ప్రతి శాఖ లో మట్టి మాఫియా వేలు పెడుతూ అక్రమ సంపాదన సంపాదిస్తూ, జన సామాన్యానికి ఇబ్బందులు పెడుతూ, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుపుతున్నా రు. అనుమతి లేకుండా మట్టి తవ్వడాన్ని అరికట్టాలని, మట్టి మాఫియాకు కిందిస్థాయి రాజకీయ నాయకులు సహా య, సహాకారాలు అందించకుండా చూడాలని, మట్టి మాఫియాపై ప్రజల్లో చైత న్యం కల్పించటంతో పాటు, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో ఆహ్లాదం వెల్లివిరియాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అంగన్వాడీ కేంద్రాలలో ఆహ్లాదం వెల్లివిరియాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ జె.రత్నకుమారి సూచించారు. మండలంలోని చెరువుమాధారం అం గన్వాడీ కేంద్రాలలో శుక్రవారం మొక్కలు జిల్లా నాటారు. అనంతరం కొత్తగా చేరిన వారికి అక్షరాభ్యాసం కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలలో ఆకు కూరలు, కూరగాయాలు, ఆహ్లాదం పరిచే మొక్కలను నాటాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే వారికి పచ్చని తివాచీ స్వాగతం పలుకుతున్నట్లు పచ్చటి మొక్కలను పెంచాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపా రు. కేంద్రాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమ్మ మాట, అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కేంద్రాలలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 24 ఏళ్ల పిల్లలను కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. 5 ఏళ్లు దాటిన వారిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పార్వతి, అంగన్వాడీ టీచర్స్ కోటేశ్వరీ, శారధ, చిన్నారులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం కలెక్టరేట్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వైరా నుంచి కొబ్బరి బొండాల లోడుతో వస్తున్న అశోక్ లే ల్యాండ్ వాహనం కలెక్టరేట్ సమీపంలోని ప్రైవేటు స్కూల్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.